

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

దునియా మె హం ఆయే హై తొ జీనా హీ పడేగా

జీవన్ హై అగర్ జహర్ తో పీనా హీ పడేగా!

'మదర్ ఇండియా' సినిమాలో కీలకమైన సన్నివేశంలో వచ్చే అత్యంత ప్రేరణాత్మకమూ, అర్ధవంతమూ, అత్యద్భుతమయిన పాట ఇది. శకీల్ బదాయుని భారతీయ తాత్త్వికతను, జీవన విధానాన్ని, కర్మ సిద్ధాంతాన్ని కలగలపి కర్తవ్య బోధను గుప్పించిన ఈ పాటకు అత్యంత సులువయిన బాణీని  పాట భావాన్ని ఇనుమడింప చేసే రీతిలో రూపొందించాడు సంగీత దర్శకుడు నౌషాద్. లత, ఉష, మీనా మంగేష్కర్‌లు తమ జీవితంలో పాటించే తత్వాన్ని ప్రపంచానికి ప్రకటిస్తూ తమ ఆత్మ స్పందనను జోడించి పాట పాడిన పాట ఇది. ఒక గొప్ప జీవిత సత్యం చెపుతుందీ పాట.

భగవంతుడి అత్యుత్తమ సృష్టి 'మనిషి' అన్నది మానవుడి అభిప్రాయం. ఇతర జీవులన్నీ పరిస్థితులకు తగ్గట్టు స్పందిస్తాయి కానీ తమ పరిస్థితులను మార్చలేవు. తమ తెలివితో, ఆలోచనతో తమ జీవన విధానాన్ని మెరుగు పరచుకోలేవు. మానవుడు ఇందుకు భిన్నం. తన పరిస్థితులను తనకు అనువుగా మార్చగలడు. ప్రకృతితో పోటీ పడగలడు. మంచు తుఫానులో తన ఇంట్లో వెచ్చగా, సురక్షితంగా ఉండగలడు. ప్రకృతి రహస్యాలను శోధించి, సత్యాలను గ్రహించి, వాటి ఆధారంగా తన జీవితాన్ని మరింత సుఖవంతం, అర్ధవంతం చేసుకోగలడు. సృష్టిలోనే ధనాత్మక, ఋణాత్మక అంశాలు కలసి ఉండే ఏర్పాటు ఉంది. సృష్టి మౌలిక లక్షణాలలో ఇదొకటి. మానవుడిని ఇతర జీవులకు భిన్నంగా నిలబెట్టే అతడి తెలివితేటలు, అతడిలో ఇతరాలలో లేని ఓ వికృతికి కూడా కారణమయింది. ఈ విశ్వంలో ప్రతి జీవి ఏదో ఓ రకంగా శంకించగానే ప్రాణాలు కాపాడుకోవటం  కోసం సురక్షితం అనిపించే చీకటి మూలలను వెతుకుతుంది. పిల్లి నిత్యం ప్రమాదాన్ని శంకిస్తూ, ప్రాణాన్ని కాపాడుకోవటం కోసం పరుగెడుతుంది. చెట్లెక్కుతుంది. దూకుతుంది. పులి వాసన పసికట్టిన లేడీ వేగం ఊహించనలవి కాదు. అంతెందుకు మానవశరీరంలో చైతన్యవంతమైన వైరస్ బ్రతికేందుకు తనకు ఆశ్రయమిచ్చిన మానవ శరీరాన్ని నాశనం చేయటమే కాదు. మానవుడు ఎన్ని ఏంటీబయాటిక్‌లు తీసుకుని ఆ వైరస్ ను నశింపచేయాలని ప్రయత్నించినా, కొత్త కొత్త రూపాలు ధరిస్తూ, సజీవంగా నిలవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. ఇందుకు భిన్నంగా మనిషి తన ప్రాణాలు తానే స్వయంగా తీసుకుంటాడు. 'ఆత్మహత్య' మానవుడికే ప్రత్యేకం. జీవించాలని

తపించే బదులు మరణించటానికి ఉవ్విళ్లూరతాడు. పరుగులిడతాడు. మరణ భయంతో నిత్యం జీవించే మనిషి, ఒక బలహీన క్షణంలో, దుర్భరమైన నిరాశ ఆవరించిన సమయంలో ఇక జీవించటం వ్యర్థమని భావించి ఆత్మహత్య చేసుకుంటాడు. అలాంటి వారికి ప్రేమనిచ్చి, జీవిత రీతిని వివరిస్తూ, బ్రతుకుపై ఆశను, ఎన్ని కష్టాలెదురయినా జీవించాలనే పాఠాన్ని బోధిస్తుందీ ప్రేరణాత్మకమైన పాట. ఒక్క క్షణం మనిషి ఓపికపడితే ఆ దుర్భర నిరాశాభావం తీవ్రత అణగిపోతుంది. ఆలోచన నిరాశను వెనక్కునెడుతుంది.

ఈ ప్రపంచంలో జన్మించిన తరువాత బ్రతకక తప్పదు. ఈ జీవితం ఒక విషమైతే ఆ విషాన్ని ప్రేమించక తప్పదు. కానీ బ్రతకక తప్పదు. సినీ కళాకారులు సినీమా సమాజంపై చూసే ప్రభావాన్ని అర్థం చేసుకుని, తమ కళద్వారా ప్రజలకు జీవితంపై ఆశను చిగురింపచేసే ప్రయత్నాలను తమ సినిమాల ద్వారా చేశారు. బ్రతుకు ఎంత దుర్భరమైనా, ఇది తాత్కాలికమేనని, మరునిమిషం అలముకున్న దట్టమైన మేఘాలు తొలిగిపోతాయనీ, చీకటి తెర చిరిగి, వెలుతురు విచ్చుకుంటుందనీ జీవితంపై ఆశను రగిల్చారు. ఎలాగో అలాగ, ఇంకో క్షణం బ్రతికే ప్రయత్నాలు చేయాలన్న తపనను, కలిగించారు. విశ్వాసాన్ని నిలపాలని ప్రయత్నించారు.

'కరూన్ క్యా  అస్ నిరాస్ భయే' అనే నిరాశ నుంచి 'కహో నా  అస్ నిరాస్ భయ్' అని సైగల్ 1979లో దుష్మన్ సినిమాలో నిరాశాంధకారాలలో ఆశల వెలుగు రేఖలు నింపాడు. ఆర్జూ లఖ్నవీ రాసిన అత్యద్భుతమైన ప్రేరణాత్మకమైన ఈ పాటకు పంకజ్ మల్లిక్ సంగీత సౌరభాలు అద్దాడు. అప్పటినుంచీ సినీ కళాకారులు ఏదో ఒక రూపంలో ప్రజలలో ఆత్మవిశ్వాసం నింపి, కష్టాలను చిరునవ్వుతో ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగే ప్రేరణనిస్తూ వచ్చారు. జీవిత సత్యాలను నిక్కచ్చిగా తెలుపుతూ, జీవనరీతిని వివరిస్తూ, జీవితంతో రాజీపడి బ్రతకటం నేర్పిస్తూ వచ్చారు.

రాత్ భరేకా హై మెహమాన్ అంధేరా

కిస్‌కె రోకా రుకా హై సవేరా...

'సోనే కీ చిడియా' సినిమాలో నాయిక నిరాశా నిస్పృహలతో జీవితం పట్ల విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోబోతుంది. ఆ సమయంలో ఆమెకీ పాట వినిపిస్తుంది. మనిషి జీవితంలో రాత్రి, పగళ్లు విడదీయరాని భాగాలు. రాత్రిని వెన్నంటి పగలుంటుంది. పగలు వెంటనే రాత్రి ఉంటుంది. చక్రనేమి క్రమేణ అయిన ఈ పగలు రాత్రుళ్ల కదలికలు ఒక నిర్దిష్టమైన సత్యం. వెలుతురు సుఖం. రాత్రి దుఃఖం. కాబట్టి సుఖం తరువాత దుఃఖం, దుఃఖం తరువాత సుఖం ఇది జీవిత గమనంలోని ఒక మౌలిక లక్ష్యం. అందుకే కష్టం వచ్చినప్పుడు క్రుంగిపోకూడదు. రాత్రి తరువాత పగటి వెలుతురు తప్పకుండా వస్తుందన్న ఆశతో ఎదురు చూడాలి చీకటి ఉండేది రాత్రి వేళనే అనీ, తెల్లవారటాన్ని ఎవ్వరూ ఆపలేరని అర్థం చేసుకోవాలి అంతేకానీ, జీవితమంతా చీకటని నిరాశ పడకూడదు.

రాత్ జితీని  భి సంగీన్ హోగీ

సుబహ ఉత్నీ హి రంగీన్ హోగీ

గమ్ న కర్ గర్ హై బాదల్ ఘనేరా

కిస్‌కి రోకే రుకా హై సవేరా?

రాత్రి ఎంత దట్టమైనదైతే, ఉదయం అంత అందమైనదవుతుంది. కాబట్టి నల్లటి మేఘాలు దట్టంగా అలముకున్నాయని బాధపడకూడదు. నిరాశలో మునిగిపోకూడదు. ఎందుకంటే ఎవరు ఆపినా తెల్లవారటం ఆగదు. కాబట్టి కష్టాలు ముంచెత్తినా అధైర్యపడకూడదు. సుఖాల ఒడ్డు చేరతామన్న ధైర్యం ప్రదర్శించాలి.

ఇటీవలి కాలంలో వచ్చిన సినిమాల్లో కూడా సందర్భానుసారంగా ఇలాంటి ప్రేరణాత్మక గీతాలు, జీవించాలనే తపనను రగిలించే గీతాలను కళాకారులు సృజించారు.

పద్దర్ కే హై సబ్ రాస్తే... పర్వాహ నహీ!

ధుంధ్‌లే హై చెప్పేఖ్వాచ్ నే.. పర్వాహ నహీ!

ఛల్నీ హై సీనా. రహనేదో

అబ్ జోభీహో పర్వాహ నహీ!

రాళ్లతో నిండిన కఠినమైనది మార్గం. అయినా ఎలాంటి బాధలేదు. కలల దీపాలు ఆరిపోయే స్థితిలో ఉన్నాయి. అయినా బాధలేదు. హృదయం తూట్లు పడింది. అలాగే ఉండనీ. ఇప్పుడేమైనా ఫరవాలేదు అంటూ ముందుకు సాగిపోతాడు. ఎం.ఎస్ ధోనీ: ది అన్ టోల్డ్ స్టోరీలో హీరో, మనోజ్ ముంతాషిర్ రాయగా అమోల్ మాలిక్ బాణీ కూర్చగా, సిద్దర్ధ బస్రూర్ పాడిన ఈ పాట్ పాడుతూ

ఝూతే ఖ్వాబోంకో మనా లేంగే

కటీ పతంగోంకో థామేంగే

హోహో హై జజ్బా

సులఝాలేంగే ఉల్ ఝె రిశ్తోంకా మాంజా

'కైపోచే' సినిమాలో అమిత్ త్రివేదీ పాడిన ఈ పాటను స్వానంద్ కిర్కిత్ రాయగా అతుల్ త్రివేది స్వయంగా సంగీత రచన చేశాడు. చెదరిన కలలను తిరిగి పోగేసుకుంటూ తెగిన పతంగిని హృదయానికి హత్తుకుంటాను. చిక్కు పడిన బాధల చిక్కుముడి విప్పుతాను. అంత శక్తి ఉంది. శ్రద్ద ఉంది. తపన ఉంది అంటున్నాడీ హీరో ఈ పాటలో. ఇక్కడ బంధాల చిక్కుముడి పడ్డ మాంజాను విప్పుతాను అంటున్నాడు. మాంజా అన్నది పతంగులను ఎగరవేసేందుకు కట్టే బలమైన దారం. చిక్కుపడిన బంధాల మాంజాదారం చిక్కుముడి విప్పే స్థైర్యం ఉందంటున్నాడు హీరో.

పీఛే మేరా అంధేరా, ఆగే అంధీ అంధీ హై

మైనే ఇసీ అంధీమే దియా జలాయాహై
దిల్ పథర్ హో జాయేగా, యా పద్దర్ కా దిల్ ధడ్ కేగా
ఐసీ ఇక్ చట్టాన్‌సే మైనే సర్ టక్రాయాహై
ధజ్జీ ధజ్జీ ధజ్జీ ధజ్జీ రాత్ పురానీ
ఛేడ్ సుబహాకీ నయీ యే కహానీ
జరా నజర్ ఉఠాకే, ఉడా దిఖాకే
జమీన్ సే ఫలక్ హటాదే.

'గుల్జార్' రాసిన ఈ పాట 'సూర్మా' సినిమాలోది. 'సూర్మా గీతం'గా ప్రసిద్ధి పొందిన ఈ పాట అత్యంత స్ఫూర్తివంతమైన పాట. జీవితంలో ఓటమిని ఒప్పుకోని ఒక పోరాట వీరుడి భౌతిక మానసిక పోరాటాన్ని అత్యద్భుతంగా ప్రదర్శిస్తుందీ పాట.

'సూర్మా' సినిమా 'సందీప్' అనే హాకీ ఆటగాడి కథ. తుపాకీ గుండు తగలటంతో సందీప్ శరీరం చచ్చుపడిపోతుంది. కానీ నిరాశకులోనుకాడు సందీప్. విధిని ధైర్యంగా ఎదుర్కుంటాడు. విధితో పోరాడి, పోరాట పటిమను ప్రదర్శించి మళ్లీ హాకీ ఆడే స్థాయికి చేరుకుంటాడు. అర్జున్ అవార్డు పొందుతాడు. అందుకే పాట ఆరంభంలో నా వెనుక చీకటి, నా ముందు కన్ను పొడుచుకున్నా కనబడని దట్టమైన తుఫాను అంటాడు. శరీరం చచ్చుపడిపోయింది. ఇక భవిష్యత్తులో ఆశాదీపం వెలిగించాను అంటున్నాడు హీరో.

అంటే ఎలాంటి ఆశా లేని అనంతమైన నిరాశ లోయ అట్టడుగున, చీకటి తప్ప మరేమీ లేని స్థితిలో ఆశాదీపం వెలిగించాడన్నమాట. అటువంటి నిరాశామయ స్థితిలో దిగజారటం చాలా సులభం. పోరాడాలన్న ఆలోచన రావటమే సగం విజయం. మళ్లీ మామూలు జీవితం గడపవచ్చన్న ఆలోచన రావటమే కాదు అసంభవమన్నదాన్ని సంభవం చేసేందుకు ప్రయత్నించటం పరమాద్భుతం. అందుకే హృదయం రాయి అయినా అవుతుంది. లేక, రాయి కరగనయినా కరుగుతుంది. అలాంటి ఒక కఠినమైన పాషాణ శిలతో తలపడుతున్నాడని హీరోకు తెలుసు. ఇక్కడే గేయ రచయిత ప్రతిభ ప్రస్ఫుటమవుతుంది.

నాయకుడు పక్షవాతానికి గురయ్యాడు. శరీరం చచ్చుపడిపోయింది. అంటే నిర్జీవమైన రాయితో సమానం. ఎలాంటి స్పందనలుండవు. కదలదు శరీరం. అందుకే హృదయం రాయి చేసుకుంటానన్నాడు. రాయిని కరగిస్తానన్నాడు. చివరికి కఠినమైన పాషాణ శిలతో తలపడుతున్నాడంటున్నాడు. 'శిల' అన్న పదాన్ని గుల్జార్ అత్యంత రమణీయంగా అర్థవంతంగా వాడటం, ఆ పదంతో ఆడుకోవటం గమనించవచ్చు. ఇక్కడ 'ధజ్జీ ధజ్జీ ధజ్జీ' అని పలు మార్లు అనిపిస్తాడు. 'ధజ్జీ' అంటే చీల్చి ముక్కలు చెయ్యడం. పాషాణ శిలను నుజ్జు నుజ్జు కొడతాడన్నమాట. అందుకే రాత్రి కథ వదిలి

అందమైన ఉదయం కథ చెప్తానంటున్నాడు. కళ్లు ఎత్తి ఎగిరి చూపించమటున్నాడు. భూమిపైనుండి ఆకాశాన్ని తొలగించమంటున్నాడు. ఆకాశం హద్దు. ఆపై ఉండేది అనంతం. తనలోని అంతులేని శక్తిని గుర్తించిన మనిషి, హద్దులను చెరిపివేస్తాడు. ఒక అసంభవమయిన విషయాన్ని సంభవం చేస్తాడు. దాన్ని గుల్జార్ ఎంతో స్ఫూర్తివంతంగా ప్రదర్శించాడు. ఇలాంటి స్ఫూర్తివంతమైన పాటలలో విధి, దైవాలపై విశ్వాసం అధికంగా కనిపిస్తుంది. ఈవిశ్వాసం మనిషిని నిరాశ అంధకారం నుంచి చిగురించే ఆశ అనే వెలుతురు వైపు నడిపిస్తుంది.

మాలిక్ హై తెరే సాథ్ న డర్ గం సె తూ ఐ దిల్

మెహనత్ కరె ఇన్సాన్ తొ క్యాకామ్ హై ముష్కిల్

జైసా జొ కరేగా యహ వైసాహి భరేగా

'భగవంతుడు నీవెంట ఉన్నాడు. కష్టపడితే అసాధ్యమైనదేదీ లేదు. చేసిన పనికి తగ్గ ఫలితం లభిస్తుంది' ఇలాంటి మాటలతో వ్యక్తికి స్ఫూర్తి నివ్వటం సులభం. 'గమ్ జిస్‌నే దియే హై వహీ గం దూర్ కరేగా' కష్టాన్ని ఇచ్చిన వాడే కష్టాన్ని దూరం చేస్తాడు. కాబట్టి నిరాశ నిస్పృహలలను దరిచేరనీయకుండా కర్తవ్యాన్ని నిర్వహించటమే మన పని అని చెప్పటం సులభం. ఇక్కడే వ్యక్తికి దైవంపై విశ్వాసం ప్రాధాన్యం తెలుస్తుంది. ఏదో ఓ శక్తి తనను నడిపిస్తోందని, తనకు రక్షణనిస్తుందన్న భావన మనిషికి ఎంతో ధైర్యాన్ని, ఇచ్చి సాంత్వన నిస్తుంది.

విశాల్ దాద్లాని, శేఖర్ రివ్జియానిలు రాసి సంగీత దర్శకత్వం వహించగా రాహిత్ ఫతే అలీఖాన్ పాడిన ఈపాట భగవంతుడిపై విశ్వాసం అనే అంశం ద్వారా కష్టాలను అధిగమించి ముందుకు సాగే స్ఫూర్తినిస్తుంది.

ధుంద్‌లా జాయే మంజిలేన్

ఇక్ పల్ కో తూ నజర్ కో ఝుకా

ఝుక్ జాయే సర్ జహా వహీ

మిల్‌తా హై రబ్ కా రాస్తా.

గమ్యం అగమ్య గోచరం అయినప్పుడు క్షణం సేపు కళ్లు దించుకో. ఎక్కడ నీ తల వంగిందో, అక్కడ నీకు దేవుడి దారి మొదలవుతుంది. 'దిక్కులేని వాడికి దేవుడే దిక్కు', 'అన్ని ఆశలు అడుగంటిన తరువాత మిగతా ఏకైక ఆశ భగవంతుడు' అన్న ఆలోచనను అత్యద్భుతంగా ప్రదర్శిస్తుందీ పాట. అసంభవం అనుకుని ఆశ వదిలేసిన సమయంలో భగవంతుడిపై విశ్వాసం ఉంచితే, దారి భగవంతుడే చూపిస్తాడంటుందీ పాట.

జబ్ హోగా అంధేరా

తబ్ పాయేగా దర్‌మేరా

ఉస్ దర్ పే ఫిర్ హోగీ తేరీ సుబహ

తూ నజానే ఆస్ పాస్ హై ఖుదా..

చీకటి దట్టంగా అలముకున్నప్పుడు నీకు నా ద్వారం కనిపిస్తుంది. నా ద్వారం దగ్గర నీ రోజు ఆరంభమవుతుంది నీకు తెలియదు నీ దగ్గరలోనే భగవంతుడున్నాడు. నీ వెంటే ఉన్నాడు భగవంతుడు అంటూ స్ఫూర్తినిస్తుందీ పాట.

'భగవంతుడు' అన్న భావన వ్యక్తి బలహీనత కాదు. వ్యక్తి ఆత్మ విశ్వాసం, ధైర్యం, స్థైర్యం ముందడుగు వేసే ప్రేరణ. కానీ పలుకారణాల వల్ల సమాజంలో భగవంతుడిపై విశ్వాసం సడలుతోంది సమాజంలో. ఫలితంగా ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన సమాజాలలో నిరాశ నిస్పృహలు అధికమవుతున్నాయి. ఆత్మ విశ్వాసం లేని మనిషి పశువుకన్నా హీనంగా ప్రవర్తిస్తున్నాడు. అన్ని ఆశలు అడుగంటిన మనిషి, చీకటిలో వెలుతురును చూపించే విశ్వాసానికి దూరమయి నిరాశాంధకారంలో మునిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. పశువై తోటి మానవుడిపై హింస నెరపుతున్నాడు. ఇంకా జీవితంలో తొలి అడుగు వేయని వారు, ఎంతో భవిష్యత్తు  ఉన్నవారూ, చిన్న కష్టాలకి తల్లడిల్లి, నిరాశా పాతాళానికి దిగజారి తమ జీవితాలను అర్ధాంతరంగా తమ చేతులతోనే చిదిమి వేసుకుంటున్నప్పుడు వారికి ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వని మన సమాజాన్ని, జీవన విధానాన్ని నిందించక తప్పదు. మన జీవన విధానాన్ని పునస్సమీక్షించుకుని, మానవుడి జీవితంలో 'దైవం పైన విశ్వాసం' ప్రాధాన్యాన్ని గుర్తించి, గతంలో తరతరాలుగా జరుగుతున్న పొరపాటును సవరించాలని ప్రయత్నించాల్సి ఉంటుంది.

The sea of Faith

was once, too, at the full, and round earth's shore

Lay like the folds  of a bright girldle traveled.

But now I only hear

Its melancholy,   long, with drawing roars,

Retreating, to the breath

of the night – wind, down the vast edjeస్ drear

And naked slingles of the world

'Dover Beach ' కవితలో, విశ్వాసం నీడ తొలగుతున్న సమాజాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు మాథ్యూ అర్నాల్డ్. ఆ విశ్వాసం నీడ తొలగిన సమాజంలోని దుర్భర వేదనను ఇప్పుడు మనం అనుభవిస్తూన్నాం. ఇటువంటి సమయాల్లో, నిరాశ, నిస్పృహలు అలముకున్నప్పుడు ఆత్మ విశ్వాసాన్ని సాంత్వనను ఇచ్చే ప్రార్ధనా గీతం కూడా మన కళాకారులు మనకోసం సృజించారు. అది పాడుకుంటూ, నిరాశా నిస్పృహల నిశీధిలో కూడా స్వాంతన నిచ్చే వెలుతురువైపు చూసే వీలు కలుగుతుంది.

ఏయ్ మాలిక్ తెరే బందె హమ్
ఐసీ హో హమారే కరమ్
నేకీ పర చలీ, ఔర్ బదీ సే టలే
తాకి హస్తే హువే నిక్‌లే దమ్

(వచ్చేనెల మరిన్ని అర్ధవంతమైన మధుర గీతాలతో...)

Click here to share your comments